## క్లుప్తంగా

### తుపాన్ బాధితులకు నగదు అందజేత



నగదును అందజేస్తున్న చెంగల్‌రాయులు

ఏర్పేడు: మండలంలోని కోబాక ఎస్టీ కాలనీలో మిచాంగ్ తుపాన్ బాధితులకు వైఎస్సార్ సీపీ మండల నాయకుడు చెంగల్‌రాయులు ఆదివారం పరిహారం అందజేశారు. ఎస్టీ కాలనీలో వర్షాలకు 5 పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.2500 మంజూరు చేసింది. అలాగే ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామోలిన్ అందజేశారు. వీఆర్వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### ఉరుస్తున్న ఎంపీడీఓ కార్యాలయం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనం మరమ్మతులకు గురికావడంతో వర్షం పడితే ఉరుస్తోంది. సమావేశ హాలు ముందు భాగం స్లాబ్ నుంచి నీరు కారుతోంది. పెద్ద వర్షం పడితే అధికారులు అవస్థలు పడాల్సి వస్తోంది.

### ప్రజలకు చేరువ కావాలి

వరదయ్యపాళెం: సామాన్యుడి శంఖారావం నినాదంతో ప్రజలకు చేరువ కావాలని పార్టీ శ్రేణులకు ఆమ్ ఆద్మీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ పిలుపునిచ్చారు. ఆదివారం వరదయ్యపాళెంలో పార్టీ మండల కన్వీనర్ సందింటి శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో సత్యవేడు నియోజకవర్గ నూతన కన్వీనర్‌గా నందినిని ఎంపిక చేసి పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ సామాన్యుడు శంఖారావం పేరుతో ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ మహిళా కన్వీనర్ బొప్పన పార్వతి, పార్టీ నాయకులు సూర్య, గిరీష్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

### బార్‌గా మారిన క్రీడా మైదానం



మైదానంలో పడి ఉన్న ఖాళీ మద్యం సీసాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం మందుబాబులకు కేరాఫ్‌గా మారుతోంది. రాత్రి వేళల్లో మద్యం సేవించి ఖాళీ బాటిళ్లు, తాగేసిన సిగరెట్ పీకలు, ఖాళీ సిగరెట్ పెట్టెలు, తినుబండారాల వ్యర్థాలను అక్కడే పడేసి వెళుతున్నారు. నిత్యం ఉదయం స్కూలు వచ్చిన టీచర్లు వీటిని శుభ్రం చేయించాల్సి వస్తోంది. పోలీసులు స్పందించి క్రీడా మైదానంలో తాగుబోతులు మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### కేంద్ర పథకాలపై ప్రచారం



మాట్లాడుతున్న ఆనంద్

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం కాసరం గ్రామంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, కుప్పప్రసాద్, కొండేటి గోపాల్, వేడాం కృష్ణయ్య, కందాటి మునిరాజా, రవి ఆచారి, సంజీవయ్య, సర్పంచ్ మునెమ్మ, వీఆర్వో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

### అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందుకున్న వారితో విమలారీస్

ఏర్పేడు: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని లవ్‌ఇన్‌ట్రస్ట్ (ఎల్‌ఐఏటీ) సభ్యురాలు విమలారీస్ అన్నారు. ఆదివారం మండలంలోని డేవిడ్ లూయీస్‌రీస్ ఆస్పత్రిలో లవ్‌ఇన్ ట్రస్ట్ వార్షికోత్సవం జరిగింది. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. విదార్థులు క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ లభిస్తుందని తెలిపారు. ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో డాక్టర్లు ఆర్‌ఆర్‌రెడ్డి, ప్రవీణ్, రంగరాజన్, రమేష్, సుధాకర్, రామచంద్రయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆనందంగా రబీ సాగు

- నిండిన చెరువులు
- రైతుల కళ్లలో ఆనందం
- 3,072 హెక్టార్లలో వరి సాగు

**ఏ ఏడాది రబీ పంటలకు సాగునీటి ఢోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిచాంగ్ తుపాన్ రాక ముందు వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు పడక పోవడం..తెలుగు గంగ ప్రధాన కాలువలో సైతం నీరు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వారం రోజుల పాటు మిచాంగ్ తుపాన్ వర్షాలు దంచి కొట్టడంతో మండలంలోని అన్ని చెరువులు కలుజులు పారాయి. భూగర్భ జల మట్టాలు భారీగా పెరిగాయి. దీంతో రైతుల మోములో ఆనందం వికసిస్తోంది.**



కలుజు పారుతున్న పాండూరు చెరువు

వరదయ్యపాళెం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు మండలంలో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఎన్నడూ లేనివిధంగా మండలంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ ఏడాది నవంబర్ చివరి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో రైతులు సైతం వరినాట్లు వేయడంలో వెనుకపడ్డారు. తెలుగుగంగ ప్రధాన కాలువలో సాగునీరు సైతం రాకపోవడంతో రైతులు కొంతమేరకు ఈ ఏడాది పంటల సాగు ప్రశ్నార్థకమే అనుకున్న తరుణంలో ఈనెల మొదటివారంలో తుపాన్ భారీ వర్షాలు కురిశాయి. ఇరిగేషన్ చెరువులు పూర్తిగా నిండి కలుజులు పారుతున్నాయి. మండలంలోని 29 పంచాయతీల్లో 80 చెరువులు ఉండగా, ఇవన్నీ కూడా కలుజులు పారుతూ పంటలకు భరోసానిస్తున్నాయి. ఇప్పటి వరకు రబీ సీజన్‌లో మండలంలో 3,072 హెక్టార్లలో వరి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సాగు విస్తీర్ణ పెరగవచ్చని అంచనా. పంట దిగుబడులు బాగా వస్తాయని రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

**ఆనకట్టల్లో ఉధృతంగా వరదనీరు**

మండలంలో 8 సాగునీటి ఆనకట్టలు ఉన్నాయి. ఈ ఆనకట్టల ద్వారా వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతం ఆయకట్టుకు నీరు ప్రవహిస్తోంది. సంతవేలూరు సమీపంలో పులిబొంద, అంబూరు సమీపంలోని మార్లమడుగు, సీఎల్ఎన్‌పల్లి సమీపంలోని చావాలి, కళత్తూరు సమీపంలోని పాముల కాలువ, కదూరు కూడలి వద్ద సున్నపుకాలువ, బత్తలవల్లం, మత్తేరిమిట్ట సమీపంలో పాత, కొత్త కరిపేటి కాలువలు, పెద్ద పాండూరు సమీపంలోని రుద్రాక్ష మడుగు ఆనకట్టలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



సంతవేలూరు చెరువుకు జలకళ



పెద్ద పాండూరు సమీపంలో నిండుగా ప్రవహిస్తున్న రుద్రాక్ష మడుగు



నీటి ప్రవాహంతో ఉన్న పులిబొంద ఆనకట్ట వాగు



నిండుగా రాచర్ల చెరువు

## చలికి తట్టుకునేలా గోశాలకు షెడ్డు



గోశాలను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: చలిగాలులకు తట్టుకునేలా గోశాలకు రేకుల షెడ్ ఏర్పాటు చేయనున్నట్లు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. దేవస్థానం గోశాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. గోవులకు దాణా, ఆహారం అందుతోందా అని సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి వరకు చలిగాలులు తీవ్రత ఎక్కువగా ఉంటాయని, ఆవులు, దూడలు చలి తీవ్రతకు ఇబ్బందిపడే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఈవో కేఎస్ రామారావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆవు, దూడలు చలి తీవ్రతను తట్టుకునే విధంగా రేకుల షెడ్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. గోశాలను ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఎండోమెంట్ కమిషన్ కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుందని, జవాబుదారి తనంతో పనిచేయాలని సూచించారు. పశు వైద్యాధికారి శ్రీకాంత్, ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## పరిహారం పంపిణీలో నిర్లక్ష్యం

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరు పంచాయతీలో ఇటీవల కురిసిన మిచాంగ్ తుపాన్‌కు వరదనీటి ముంపునకు గురైన బాధితులకు పరిహారం ఇవ్వడంలో స్థానిక వీఆర్వో నిర్లక్ష్యం చూపుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి నీరు చేరిన బాధితులకు పరిహారం ఇవ్వకుండా, స్థానికంగా కొందరు చెప్పిన వారికే పరిహారం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనకాలనీ పూర్తిగా ముంపునకు గురైనప్పటికీ పరిహారం ఇవ్వలేదని చెబుతున్నారు. వర్షాల సమయంలో వీఆర్వో ఇటు వైపు రాలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ గౌరీశంకరరావును అడగగా, వీఆర్వో ఇచ్చిన జాబితా మేరకు 35 మందికి నగదు పంపిణీ చేశామన్నారు. గిరిజనులకు పరిహారం అందని విషయమై శనివారం తనకు ఫిర్యాదులు అందాయని, తక్షణమే విచారిస్తామని, అర్హులకు అన్యాయం జరిగి ఉంటే వీఆర్వోపై శాఖపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. అర్హులందరికీ పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.

## వైభవంగా శ్రవణా నక్షత్ర పూజలు



ఉభయ దేవేరులతో కల్యాణ వెంకన్న ఊరేగింపు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున తిరుప్పావై సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను, ధనుర్మాస పూజలను అర్చకులు పూర్తి చేశారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనం కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ షరాబు షనాయి, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

**ధనుర్మాస పూజలు ప్రారంభం**

ధనస్సు రాశిలోకి సూర్య సంక్రమణం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ఆదివారం ధనుర్మాస పూజలను ప్రారంభించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి 12 గంటలకు ఆలయంలో ధనుర్మాస ప్రారంభ గడియల్లో పూజలను, గంట, నైవేద్య కార్యక్రమాలను అర్చకులు పూర్తి చేశారు. ఆదివారం వేకువ జామున తిరుప్పావై ప్రవచనాలతో ఆలయాన్ని తెరచి శుద్ధి, తోమాల నిర్వహించారు. ధనుర్మాస పూజలను పూర్తి చేసి 5 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ, అగస్తీశ్వర, పరాశురేశ్వర, అవనాక్షమ్మ, శక్తి వినాయక, వీరభద్రస్వామి ఆలయాలతో పాటు పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథ ఆలయంలో, స్థానిక సొరకాయలస్వామి, వీర రాఘవస్వామి ఆలయాలను వేకువ జామున తెరచి ధనుర్మాస పూజలను నిర్వహించారు. భక్తుల కు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.జనవరి 14 వరకు ధనుర్మాస పూజలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## శ్రీకాళహస్తిలో ఏఐటీయూసీ మహాసభ



మాట్లాడుతున్న హరినాథరెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలో ఆదివారం ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. ముందుగా ర్యాలీగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించారు. నాయకులు ఓబులేసు, హరినాథ్‌రెడ్డి, రాధాకృష్ణ, సుబ్బారెడ్డి, మురళి, రవి, సీహెచ్ శివకుమార్, జనమాల గురవయ్య, వైఎస్‌మణి, శ్రీరాములు, శివ, కేవై రాజా, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ కిట్ అందజేత



కిట్ అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణం బృందావనం కాలనీకి చెందిన యువకులకు ఆదివారం వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడు తలపా దామోదర్‌రెడ్డి వాలీబాల్ కిట్లును అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం



రాపూరులో ర్యాలీ

రాపూరు: హిందూ ధర్మప్రచారంలో భాగంగా ఆదివారం సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమేళనం కార్యక్రమాన్ని రాపూరు సమీపంలోని కృష్ణమందిరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక శివాలయం నుంచి మద్దెలమడుగు కృష్ణమందిరం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హిందూ ధర్మంపై సమాజంలో జరుగుతున్న దాడులను వివరించారు. ఈ క్రమంలో ప్రజల్లో హిందూ ధర్మంపై చైతన్యం కలిగించేందుకు సమ్మేళనం చేపట్టినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమరత సేవా సంస్థ నిర్వాహకులు ఈశ్వరయ్య, రాంబాబా, మనోహర్‌రెడ్డి, భాస్కర్, ఆనంద్, రాఘవరెడ్డి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

## వర్తక సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

పిచ్చాటూరు: నాగలాపురం మండల వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నికున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎల్.సోమసుందరం, అధ్యక్షుడిగా ఆర్‌డీ నారాయణ, కార్యదర్శిగా ఎస్ దురై, ఉపాధ్యక్షులుగా జె.సుబ్రమణ్యం, పి.సుగుణ రాముడు, ఎన్.అనిల్‌కుమార్, కోశాధికారిగా బి.కుమరన్, సంయుక్త కార్యదర్శిగా ఎస్ శ్రీనివాసన్, ఆర్గనైజర్‌గా ఎస్.క్రిష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## శ్రీవారి వైభవాన్ని చాటిన సుబ్రమణ్యశాస్త్రి



సాధు సుబ్రమణ్యశాస్త్రికి పుష్పాంజలి

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి ఆలయ చరిత్రను, శ్రీవేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు సాధు సుబ్రమణ్య శాస్త్రి అని ప్రముఖ శాసన పరిశోధకుడు తొండవాడ సొరకాయల కృష్ణారెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాధు సుబ్రమణ్యశాస్త్రి 135వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి ఆలయం ఉన్నంతవరకు ఆయన చిరంజీవిగా నిలుస్తారన్నారు. టీటీడీలో చిన్నస్థాయి ఉద్యోగిగా ఉంటూ వెయ్యికి పైగా శాసనాలను వెలికితీసి పరిష్కరించిన గొప్ప వ్యక్తి సుబ్రమణ్యశాస్త్రి అని చెప్పారు. అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో 12 వేల సంకీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో అధిక భాగం సంకీర్తనలను శాస్త్రి పరిష్కరించి సమాజానికి అందించారని వివరించారు. టీటీడీ సీఏఓ శేషశైలేంద్ర మాట్లాడుతూ తిరుమల శ్రీవారికి అమూల్యమైన సేవలందించిన సాధు సుబ్రమణ్యశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ వంటి మహానుభావుల జీవితాలను విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. అంతకుముందు సాధు సుబ్రమణ్య శాస్త్రి జయంతి సందర్భంగా శ్వేత భవనం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి సీవీఅండ్ఎస్ఓ నరసింహ కిషోర్, టీటీడీ పీఆర్ఓ డాక్టర్ టి.రవి పుష్పాంజలి ఘటించారు.

## కండలేరులో 13.118 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 13.118 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## వర్ష బాధితులకు టార్పాలిన్ పట్టల పంపిణీ



టార్పాలిన్ పట్టలను అందజేస్తున్న మిద్దెల హరి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఏనుగుల గుంట ప్రాంత ప్రజలకు టార్పాలిన్ పట్టాలను మిద్దెల హరి యువసేన ఆధ్వర్యంలో ఆప్కో మాజీ డైరెక్టర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ మిద్దెల హరి పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి 4వ వార్డు ఏనుగులగుంట ప్రాంతంలో ఇటీవల తుపానుకు దెబ్బతిన్న నివాస ప్రాంతాలను పరిశీలించి పూరిగుడిసెలకు టార్పాలిన్ పట్టలు అందజేస్తానని హామీ హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు స్థానిక నాయకులతో కలిసి 30 టార్పాలిన్ పట్టాలను పంపిణీ చేశారు. యువసేన నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన కుటుంబాలకు దుప్పట్లు



రేణిగుంట: మండలంలోని వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో 100మంది గిరిజన కుటుంబాలకు ఆదివారం అమెజాన్, డొనేట్‌కార్ట్ సౌజన్యంతో ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు గిరిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. సంస్థ ముఖ్య కార్యదర్శి అమ్ములురాజు, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేతో బాలికల్లో ఆత్మస్థైర్యం





టోర్నమెంట్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: కరాటేతో బాలికలు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవచ్చని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నాగలాపురంలోని ఓ ప్రవేటు కల్యాణ మండపంలో జరిగిన కరాటే టోర్నమెంట్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రతిభ కనబరచిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అఘాయిత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనాలంటే బాలికలు చిన్నప్పటి నుంచే కరాటే నేర్చుకోవాలన్నారు. దీనివల్ల ఎంత పెద్ద సమస్యనైనా దీటుగా ఎదుర్కొనే ధైర్యం వస్తుందని తెలిపారు. అంతకు ముందు టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, కరాటే మాస్టర్ ఏలుమలై, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలి, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎం సురేష్, వైస్ సర్పంచ్ సునీత, అలగేశన్, నాయకులు శ్యామ్, ఉదయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**రవి కుటుంబానికి పరామర్శ**

పిచ్చాటూరు మండలం బంగాళ పంచాయతీ వైఎస్సార్ సీపీ నేత రవి తండ్రి మునస్వామి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం రవి ఇంటికి వెళ్లి మునస్వామి చిత్రపటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి ఘటించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, మండల మాజీ ఉపాధ్యక్షుడు పాలపద్మనాభం, నాయకులు అయ్యప్ప, మోహన్ తదితరులు పాల్గొన్నారు.